ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 15 ఏప్రిల్ 2024





నాయకుడిని అంటూ నయవంచకుడిగా మారావు!

సీఎంగా కంత్రీ పాలన చేస్తున్నావు
స్వర్ణాంధ్ర సాకార యాత్రలో సీఎం జగన్‌పై బాలయ్య ఫైర్
మూడు రెక్కలను ముక్కలు చేయాలని ప్రజలకు పిలుపు



శ్రావణి

అంబికా



టీడీపీ జెండాతో..

గార్లదిన్నె, ఏప్రిల్ 14: నాయకుడిని అంటూ.. రాష్ట్ర ప్రజల పాలిట నయవంచకుడిగా మారావని సీఎం జనగ్‌పై హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో స్వర్ణాంధ్ర సాకార యాత్ర బాలయ్య అన్‌స్టాపబుల్ బహిరంగ సభను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సభలో ఆయనతో పాటు అనంతపురం లోక్‌సభ ఎన్డీయే అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, శింగనమల నియోజకవర్గం ఎన్డీయే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ తనదైన శైలిలో సీఎం జగన్‌పై విరుచుకుపడ్డారు. మడమ తిప్పనంటూ మెడలు విరిచావు.. మద్యపాన నిషేధం అంటూ నిరుపేదల రక్తం తాగుతున్నావు.. జగనన్న అంటూ జలగలా పీల్చుతున్నావు.. మామయ్య అంటూ మనోభావాలను మంటగల్పుతున్నావు.. నవరత్నాలు అంటూ నవనాడులను నలిపేశావని సెటైర్లు వేశారు. నేనున్నా అంటున్నావు.. అవును నువ్వు ఉన్నావు. నువ్వు లేకుండా ఎక్కడికి పోతావు.. పోయే సమయం దగ్గరకు వచ్చింది అంటూ ఎద్దేవా చేశారు. ఎంత దారుణంగా ప్రవర్తిస్తున్నావో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. దళితులకు అండ అంటూ వారి జీవితాలతో ఆడుకొని ప్రాణాలు తీసి దాహం తీర్చుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాస్కు అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడిని చేసి చంపారని విమర్శించారు. జడ్జి రామకృష్ణ మీద తప్పుడు కేసులు బనాయించి మానసికంగా వేధించారని తెలిపారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినందుకు దళితులకు శిరోముండనం చేయించాడన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంత్‌కుమార్ తన కారు డ్రైవర్ దళితుడిని చంపి డోర్ డెలివరీ చేశాడు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎస్సీలకు ఎంతో ద్రోహం చేశారని మండిపడ్డారు. రాజధాని ఉద్యమ కారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించి వారి మెతుకులను ముద్దగా మార్చుకున్నాడన్నారు. ఇలా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు అందరికీ అన్యాయం చేసిన ఘనుడు సీఎం జగన్ అని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ల నిధులు దారి మళ్లించి అందరికీ అన్యాయం చేసిన దుర్మార్గుడు జగన్ అంటూ నిప్పులు చెరిగారు. ఆఖరికి అక్కచెల్లెమ్మల ఆస్తుల్లో వాటాలు అడుగుతున్నావు.. వారి ఉసురుపోసుకోకు అంటూ హితవు పలికారు. సీఎంగా కంత్రీ పాలన చేస్తున్నావంటూ ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి భ్రష్టు పట్టించాడన్నారు. భావితరాలకు ఇసుక దొరకనంతగా అక్రమంగా తరలించి కోట్లు దండుకున్నారన్నారు. నకిలీ మద్యంతో జే బ్రాండ్స్ ద్వారా ఆడపడుచుల తాళిబొట్లు తెంచాడని అన్నారు. సీఎం జగన్ మోసానికి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. టీడీపీ రాయలసీమలో కృష్ణమ్మ జలాలను పరుగులు పెట్టించిందన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ముఠాకక్షలకు వైసీపీ ఆజ్యం పోసిందని ఆరోపించారు. రాయలసీమను రక్తసీమగా మార్చిందని దుయ్యబట్టారు. ఈ ఎన్నికలు ఎంతో ముఖ్యమైనవన్నారు. ఈ ఎన్నికల్లో మూడు రెక్కలను ముక్కలు చేసేందుకు అందరూ కలిసి రావాలన్నారు. ఎన్డీయే శక్తి ఎనలేనిదన్నారు. ఈ శక్తిని ఎవరూ ఏమీ చేయలేరన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ గతంలోని అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందన్నారు. బీసీ-ఈపై ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. కచ్చితంగా కొనసాగిస్తామన్నారు. వైసీపీ దుష్ప్రచారం నమ్మవద్దంటూ తెలిపారు. ముస్లింల అభ్యున్నతికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ధేశిస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, విశాలాక్షి, రామలింగారెడ్డి, గుర్రం ఆదినారాయణ, గేటుక్రిష్టారెడ్డి, ఆవులక్రిష్ణయ్య, ఇల్లూరు రామాంజి, వడ్డేవన్నూర్, గుత్తాబాలకృష్ణ, దేగల కృష్ణామూర్తి, నరసింహారెడ్డి, పుల్లన్న, సుంకన్న, బాబయ్య, అంజి, శీనా, గంగాధర్, గోరకాటి వెంకటేసు, జయరాం, చితంబరప్ప, చితంబరిదొర, ఎంపీటీసీలు సురేంద్ర, విశ్వనాథ్, చల్లా నాగరాజు, రమణప్ప, సుధాకర్ రెడ్డి, ఓబిరెడ్డి, సామాల మధు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో..



జై తెలుగుదేశం..

బాలయ్యకు బ్రహ్మరథం

బహిరంగ సభలకు పోటెత్తిన జనం
అభివృద్ధి కావాలా..? అరాచకం కావాలా..?
రాక్షస రాజ్యమా..? రామరాజ్యమా..?
ఆలోచించాలని ప్రజలకు బాలయ్య విజ్ఞప్తి

అడుగడుగునా జననీరాజనం
జిల్లాలో రెండో రోజు కొనసాగిన స్వర్ణాంధ్ర సాకార యాత్ర



అనంత సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ

అనంతపురం ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర సాకార యాత్ర పేరుతో హిందూపురం ఎమ్మెల్యే ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ చేపట్టిన రోడ్ షోలకు జనం బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా హారతులు పడుతూ.. బాణసంచా పేలుస్తూ .. జై బాలయ్యా అంటూ కూటమి శ్రేణులు, అభిమానులు, ప్రజలు కేరింతలు కొట్టారు. ఇక బహిరంగ సభలకైతే జనం పోటెత్తారు. రెండో రోజు ఆదివారం శింగనమల, అనంతపురం అర్బన్ నియోజకవర్గాల్లో బాలయ్య స్వర్ణాంధ్ర సాకార యాత్ర సాగింది. అనంతపురం నగరం సప్తగిరి సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కూటమి అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి బాలకృష్ణ మాట్లాడుతూ... నందమూరి తారకరామారావు అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీతర్వాత వచ్చిన ప్రభుత్వాలు తూచాతప్పకుండా అమలు చేశాయన్నారు. పేరు మార్చారే తప్పా ఏ పథకాన్ని ఆపలేదన్నారు. రెండు రూపాయిలకే కిలో బియ్యం, భూమి శిస్తు, చేనేత వస్త్రాలు ఇలా అనేక సంక్షేమ పథకాలను పేద, బడుగు, బలహీన వర్గాల కోసం తీసుకొచ్చారని గుర్తు చేశారు. అభినవ అంబేడ్కరుడు ఎన్టీ రామారావు అని కొనియాడారు. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించిన విషయం అనేది ప్రజలు గమనించాలన్నారు. దోచుకొని దాచుకోవడమే జగన్‌కు తెలిసిన అరాచకమన్నారు. దొంగకు తాళం ఇచ్చినా.. జగన్‌కు అధికారం ఇచ్చినా ఒక్కటేనని అన్నారు. రూ.1600 కోట్ల ప్రజాధనంతో రాష్ట్రమంతా సిద్ధం హోర్డింగ్‌లు పెట్టిన జగన్ దేనికి సిద్ధమని ఆయన ప్రశ్నించారు. చెల్లికి ద్రోహం చేయడానికా..? బాబాయ్‌ని చంపించడానికా..? తల్లిని మోసం చేయడానికా..? అని ప్రశ్నించారు. వైసీపీ గూండాలు తన అక్కపై అత్యాచారం చేశారని ఓ బాలుడు ప్రశిస్తే పెట్రోలు పోసి చంపడానికి సిద్ధపడిన దుర్మార్గులు అన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఏ ఒక్క నిరుద్యోగికి ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ఆ మేరకు యువతకు సమాధానం చెప్పడానికి నీవు సిద్ధమా జగన్ అని సవాల్ విసిరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ నిధులు ఏమయ్యాయో చెప్పేందుకు సిద్ధమా అని నిలదీశారు. ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేస్తే అడిగే నాథుడే లేడన్నారు. కొవిడ్‌లో అక్రమాలు ప్రశ్నించిన దళిత డాక్టర్ సుధాకర్‌కు శిరోముండనం చేసి చంపేసిన దుర్మార్గులు వైసీపీ నాయకులని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ప్రపంచ పటంలో ఉండేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో అభివృద్ధి కావాలో..? అరాచకం కావాలో ఆలోచించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగన్ రాక్షస రాజ్యం కావాలో..? చంద్రబాబు రామరాజ్యం కావాలో మీరే తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.

అనంత నగరాన్ని స్మార్ట్ సిటీగా మారుస్తాం

ఎమ్మెల్యే అనంత కుటుంబం ఆరు సార్లు ఎంపీ, ఒకసారి ఎమ్మెల్యేగా పనిచేసిందని, ఇక్కడ ఏం అభివృద్ధి సాధించారని బాలకృష్ణ ప్రశ్నించారు. నగరం అభివృద్ధి కావాలంటే కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కూటమి అధికారంలోకి రాగానే అనంతపురం నగరాన్ని స్మార్ట్‌సిటీగా మారుస్తామని హామీ ఇచ్చారు. అనంత నగరశివారులోని డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామని తెలిపారు. అనంత నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఓటుతో మట్టికరిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.



అనంతలో...

బీటీపీ పనులు ఆపింది వైసీపీ ప్రభుత్వమే

మంత్రి ఉషశ్రీచరణ్ ఇసుక దోపిడీకి అంతేలేదు
యాదవుల ఆత్మీయ సమావేశంలో అమిలినేని, గుండుమల



వేదికపై అమిలినేని సురేంద్రబాబు, గుండుమల తిప్పేస్వామి

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 14 : బీటీపీ కాలువ పనులు వైసీపీ ప్రభుత్వమే ఆపిందని కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద యాదవుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. చిన్నారులు, మహిళల నృత్య ప్రదర్శన ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది. అనంతరం ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మొదటి స్థానంలో నిలబెట్టేందుకు ఇక్కడికి వచ్చానని అన్నారు. వచ్చే నెల 13న పోలింగ్ బూత్‌లలో బటన్ నొక్కి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునే దిశగా, టీడీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మీ అందరి సహకారంతో కళ్యాణదుర్గాన్ని అభివృద్ధి చేసి మీ కలలను నెరవేర్చే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. బీటీపీ కాలువకు చంద్రబాబునాయుడు భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తే వాటిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా ఆపేసిందని విమర్శించారు. కనీసం రైతులకు పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కళ్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రంలో యాదవుల కల్యాణ మండప నిర్మాణానికి రెండు ఎకరాల వరకు స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి మండల కేంద్రంలో శ్రీకృష్ణ మందిరాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. తన చుట్టూ తిరిగే నాయకులను తానే పక్కన పెడతానని, ప్రజలు, కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటానని అభయమిచ్చారు. ఇవన్నీ చేయాలన్నా, నియోజకవర్గం అభివృద్ధి పథంలో వెళ్లాలన్నా తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ యాదవుల ఐక్యత చూస్తుంటే కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గెలుపు తథ్యమన్నారు. మంత్రి ఉషశ్రీచరణ్ ఏదైనా అడిగితే సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టించిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. ఇసుకను ప్రతి రోజూ వందలకొద్దీ లారీలతో తరలించి దోపిడీకి పాల్పడి అక్రమంగా సంపాదన కూడబెట్టుకుందని విమర్శించారు. ఇక్కడ వుంటే ఘోరంగా ఓటమి తప్పదని పెనుకొండకు మార్చుకుందన్నారు. అక్కడ కూడా ఆమెకు ఘోర పరాజయం తప్పదన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యాదవుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచారని విమర్శించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం అభివృద్ధిలో నడవాలన్నా, 114 చెరువులకు నీరు రావాలన్నా అమిలినేని సురేంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు కుబేర యాదవ్, మహిళలు, యాదవ కులస్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కడా ఇక్కడా నేనే..!





ఖాళీగా దర్శనమిస్తున్న విజిలెన్స్ విభాగం

డ్వామా, జడ్పీలో ఓ అధికారి డబుల్ రోల్
డెప్యుటేషన్‌పై వెళ్లినా.. ఇక్కడా విధులు
డ్వామా విజిలెన్స్ విభాగంలో తతంగం
సామాజిక తనిఖీల పేరుతో వసూళ్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 14 : ఒకే అధికారి రెండు పాత్రలు పోషిస్తున్నారు. నెల రోజుల క్రితం ఆ అధికారిని డిప్యుటేషన్‌పై జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా పంపారు. డ్వామా విజిలెన్స్ విభాగంలో వచ్చే ఆదాయం, పరపతిని వదులుకోలేక అక్కడ నేనే...ఇక్కడ నేనే అన్న చందంగా రెండు గుర్రాలపై స్వారీ చేస్తున్నారు. దీంతో ఇప్పటికే జడ్పీ సీఈఓ ఆ అధికారికి డిప్యుటేషన్‌పై ఉన్నారు...ఇక్కడే ఉండండి. డ్వామాకు వెళ్లకూడదని సీరియస్‌గా హెచ్చరించారు. అయితే నేమి నా ఇష్టం అన్న రీతిలో డ్వామా విజిలెన్స్ విభాగంలో కూడా కొనసాగుతున్నారు. దీంతో డ్వామా కీలక అధికారికి, విజిలెన్స్ అధికారికి మధ్య వార్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. పైగా ఉపాధి, వాటర్‌షెడ్, ఇతర డ్వామా పరిధిలో అమలు చేస్తున్న పథకాలలో జరిగిన అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై నిర్వహించే సామాజిక తనిఖీ వేదికలను బంగారు బాతులా మార్చుకున్నారు. ఎక్కడ సామాజిక తనిఖీ వేదిక నిర్వహించినా...రూ.30-50వేలు ఆ అధికారికి ఆయా మండల అధికారులు కట్టాల్సిందే. లేదంటే సామాజిక తనిఖీల్లో తేల్చిన నిధుల దుర్వినియోగం, అక్రమాలపై ఒత్తిడి తీసుకువచ్చి చర్యలకు ఉపక్రమిస్తారు. దీంతో చేసేది లేక ఆయా మండలం ఉపాధి అధికారులు అక్కడ పనిచేసే సిబ్బంది అందరూ కలిసి తలో చేయి వేసి సామాజిక తనిఖీ వేదికకు టోకెన్ చెల్లించేస్తారు. ఇక అక్కడితో ఆగరు. దుర్వినియోగమైన నిధుల శాతం ఆధారంగా మరో దఫా అధికారికి పైకం పుచ్చుకోవాల్సిందే. డ్వామాలో ఇద్దరు కీలక అధికారులు, నిఘా, హెచ్‌ఆర్ విభాగాల అధికారులే అవినీతి-అక్రమాలు ప్రోత్సాహిస్తూ, నిధుల దుర్వినియోగాలకు పాల్పడిన వారి నుంచి వసూళ్లు చేస్తూ వాటాలు పంచుకుంటున్నారనే విమర్శలు ఆ శాఖలో గట్టిగానే వినిపిస్తున్నాయి.

18వ విడతకు చేరిన సోషల్ ఆడిట్

డ్వామా పరిధిలోని ఉపాధి, వాటర్‌షెడ్, వైఎస్సార్ జలకళ ఇలా పలు పథకాలు అమలు చేస్తున్నారు. ఆయా పథకాల్లో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై విచారణ చేపట్టేందుకే.. సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 16విడతల సామాజిక తనిఖీలు పూర్తి కాగా, ప్రస్తుతం 17, 18వ విడతలు కొనసాగుతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద రూ.9కోట్లు, వాటర్‌షెడ్ ద్వారా రూ.6కోట్ల వరకు నిధులు దుర్వినియోగం చేసినట్లు సామాజిక తనిఖీల్లో తేల్చారు. సొమ్మును రికవరీ చేయడానికి డ్వామాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విజిలెన్స్ విభాగం మసకబారుతోంది. ప్రభుత్వ సొమ్మును రికవరీ చేసి బాధ్యతగా వ్యవహరించాల్సిన నిఘావిభాగం అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. సొమ్ము రికవరీ చేయకపోగా విజిలెన్స్ అధికారులు తమ జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. విజిలెన్స్, హెచ్‌ఆర్ విభాగాలలో కీలకంగా ఉన్న ఇద్దరు అధికారులతో పాటు పలువురు ఉద్యోగులు ఈ తతంగంలో భాగస్వాములుగా ఉన్నట్లు తెలుస్తోంది.

'ఉపాధి'లో రూ.9కోట్లు దుర్వినియోగం

గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు స్థానికంగా పనులు కల్పిస్తూ ఆసరగా ఉండాలని ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొందరి జేబులు నింపుకోవడానికి ఉపయోగపడుతోంది. పేదల పొట్ట నింపడం అలా ఉంచితే దుర్వినియోగమైన సొమ్మును రికవరీ చేయాలని ప్రత్యేకంగా నియమించిన నిఘా అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సుమారు రూ.9కోట్లు వరకు నిధులు దుర్వినియోగమైనట్లు సామాజిక తనిఖీద్వారా తేల్చారు. ఈ సొమ్మును సంబంధిత ఉద్యోగుల ద్వారా రికవరీ చేయాల్సిన డ్వామా విజిలెన్స్ విభాగం అధికారులు చేతికందినకాటికి దోచుకుని మమ అనిపించేస్తున్నారు. జిల్లాలో మొత్తం రూ.9కోట్లకు పైగా సొమ్ము దుర్వినియోగం కాగా ఇప్పటి వరకు రూ.5కోట్లు మాత్రమే రికవరీ చేశారు. మిగిలిన రూ.4కోట్ల సొమ్మును రికవరీ చేయకుండా బాధ్యులైన ఉద్యోగుల నుంచి ముడుపులు పుచ్చుకుంటున్న నిఘావిభాగం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్‌ఆర్ చట్టం కింద 399కేసులకు గాను రూ.1.72కోట్లు సొమ్మును రికవరీ చేయాల్సి ఉంది. ఇందులో ఉపాధిహామీ పథకం కింద 72 క్రిమినల్ కేసులకు గాను రూ.1.60 కోట్లు సొమ్ము దుర్వినియోగమైనట్లు తేల్చారు.

వాటర్‌షెడ్ కింద రూ.6కోట్ల రికవరీపై నిర్లక్ష్యం

జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో వాటర్‌షెడ్ పథకం అమలు చేసి ఆయా ప్రాంతాల్లో ప్రజల జీవనస్థితిగతులు మెరుగుపరచడానికి కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. వాటర్‌షెడ్ పథకం కింద రూ.6కోట్ల వరకు నిధులు పక్కదారిపట్టాయి. ఇప్పటి వరకు కేవలం రూ.1.5కోట్లు మాత్రమే రికవరీ చేశారు. మిగిలిన సొమ్మును రికవరీ చేయడంలో నిఘావిభాగం అధికారులు విఫలమవుతున్నారని తెలుస్తోంది. ఇందులో వాటర్‌షెడ్ పీఓ, ఏపీఓ, టీఓ, సీఓలకు సంబంధించిన క్రిమినల్ కేసులు నమోదు కాగా రూ.1.93కోట్లు నిధులు దుర్వినియోగమైనట్లు తేల్చారు. ఏపీఎం ఒక కేసుకు సంబంధించి రూ.1.08 కోట్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ మూడు కేసులకు రూ.1.03కోట్లు, గ్రామైక్య సంఘం సహాయకుల మూడు కేసులకు గాను రూ.1.97లక్షలు సొమ్మును రికవరీ చేయాల్సి ఉంది. ఇందులో వాటర్‌షెడ్ కీలక అధికారి సామాజిక తనిఖీల్లో వసూళ్లలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.

వసూళ్లలో నలుగురు అధికారులకు వాటాలు

ఉపాధి హామీ, వాటర్‌షెడ్ పథకాల్లో నిధుల దుర్వినియోగంపై రికవరీ చేయడానికి డ్వామాలో ప్రత్యేక నిఘా, హెచ్‌ఆర్ విభాగాలు ఉన్నాయి. డ్వామాలో ఇద్దరు కీలక అధికారులకు వసూళ్లు, నిధుల దుర్వినియోగంలో వాటాలు ఉన్నట్లు తెలుస్తోంది. నిఘా, పర్యవేక్షణ ఉంచాల్సిన అధికారులే నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ వస్తున్నారు. గతంలో హెచ్‌ఆర్ విభాగంలో పని చేస్తూ అవినీతి, ఆరోపణలు ఎదుర్కొని బదిలీపై వెళ్లిన ఆ అధికారి తిరిగి ఆదే స్థానానికి వచ్చారు. దీంతో ఆ ఇద్దరి అధికారులు ఉన్నతాధికారులకు మధ్యవర్తిగా ఆ అధికారి వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా డ్వామా నిఘా, హెచ్‌ఆర్ విభాగాలలో వసూళ్ల పర్వం సాగుతోందనేందుకు ఇటీవల ఆయా మండలాల్లో వసూళ్లే నిదర్శనమని చెప్పుకోవచ్చు. నిఘా, హెచ్‌ఆర్‌లో ప్రతి ఫైల్‌కు ఓ రేటు నడుస్తోందని ఆశాఖలో ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. ఇద్దరు కీలక అధికారులతో పాటు నిఘా, హెచ్‌ఆర్ విభాగాల అధికారులు నిధుల దుర్వినియోగం, అవినీతి అక్రమాలను ప్రోత్సాహిస్తూ...వసూళ్ల పర్వానికి తెరలేపుతున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.



ఇటీవల శెట్టూరు మండలంలో నిర్వహించిన సామాజిక తనిఖీ వేదిక

మార్గదర్శకుడు అంబేడ్కర్

కలెక్టర్ వినోద్‌కుమార్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచానికే మార్గదర్శకుడని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కొనియాడారు. అంబేడ్కర్ జయంతిని ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొని అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో అందరూ సమానమేనని, ఒకరు తక్కువ, ఎక్కువ అనే తేడా లేకుండా సమాన హక్కులు కల్పించారని అన్నారు. అందరూ మనషులేనని, కుల నిర్మూలనకు ఆయన ఎంతో పాటుపడ్డాడన్నారు. అలాంటి మహనీయుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వైఖోమ్‌నిదియా, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ మధుసూదన్‌రావు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, డీసీహెచ్‌ఎస్ రవికుమార్, వైద్యశాఖాధికారి డాక్టర్ ఈబీ దేవి, మైనార్టీశాఖ డీడీ రామసుబ్బారెడ్డి, వికలాంగులశాఖ డీడీ రసూల్ వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దాడిపై సీబీఐతో విచారణ చేయించాలి

ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



ఉరవకొండ, ఏప్రిల్ 14: సీబీఐతో విచారణ జరిపిస్తే అసలు దొంగలు ఎవరో బయటపడతారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై రాయితో దాడి జరిగిన నేపథ్యంలో పయ్యావుల కేశవ్ ఆదివారం ఉరవకొండలో మాట్లాడారు. వైసీపీ సోషల్ మీడియా నడిపే వ్యక్తి నాగులు రోజుల క్రితమే సంచలన సంఘటనలు జరగనున్నాయని పేర్కొన్నారన్నారు. ఎన్నికల మూడ్‌నే మార్చేస్తాయని ట్వీట్ చేయడం జరిగిందన్నారు. శ్రీధర్‌రెడ్డికి ముందే ఈ విషయం ఎలా తెలుసో పోలీసులు విచారించాలన్నారు. మూడువేల మంది పోలీసుల నడుమ సీఎం రోడ్‌షో సాగిందని, ఈ దాడిని టీడీపీపైన నెట్టడానికి సిగ్గనిపించడంలేదా అని ప్రశ్నించారు. గొడ్డలిపోటు, కోడికత్తి, గులకరాయి డ్రామాలు ఆడుతున్నారన్నారు. వైసీపీ డ్రామాలు, నాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

విజయవాడ పోలీసు కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

- మాజీ మంత్రి కాలవ డిమాండ్



రాయదుర్గం, ఏప్రిల్ 14: సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడిలో విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణాటాటాను భద్రతా వైఫల్యానికి బాధ్యుడిని చేసి ఎన్నికల కమిషన్ తక్షణమే సస్పెండ్ చేయాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి అత్యంత కట్టుదిట్టమైన భద్రత వలయం మధ్య ఉంటారన్నారు. అటువంటి వ్యక్తిపై ఎవరో ఒక వ్యక్తి రాయి విసిరారంటే దీన్ని ఘోరమైన భద్రతా వైఫల్యం కిందనే చూడాల్సి ఉంటుందన్నారు. జగన్ కావాలనే రాయితో వేయించుకున్నాడా, మరో కోడికత్తి డ్రామాకు తెరతీశాడా అనేది విచారణలో తేలాల్సిన అంశమన్నారు. 2019 ఎన్నికల ముందు కోడికత్తి డ్రామా ఆడి దళిత యువకుడి జీవితాన్ని జగన్ నాశనం చేశాడన్నారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్న ముఖ్యమంత్రిపై రాయి విసిరిన వ్యక్తిని ఇప్పటివరకు ఎందుకు పట్టుకోలేదని నిలదీశారు.

కోడి కత్తి... గులకరాయి సేమ్ టు సేమ్

- టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు



అనంతపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ కోడికత్తి డ్రామా ఎలా రక్తికట్టించారో... సీఎం హోదాలో గులకరాయి డ్రామాను అదే స్థాయిలో రక్తికట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సానుభూతి కోసమే ఈ డ్రామాలన్నీ అని ఆరోపించారు. ఆదివారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ అనుభవరాహిత్యం, అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వ్యక్తి వైఎస్ జగన్ అని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో జగన్‌పై ప్రజల్లో నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలోనే కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. గొడ్డలి వేటు... కోడికత్తి డ్రామాలు ప్రజలకు అర్థమైపోవడంతో తాజాగా గులకరాయి దాడి డ్రామాకు జగన్ తెరలేపాడని ఆరోపించారు.

సీఎం మరో జగన్నాటకానికి తెరలేపారు

- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 14: సీఎం జగన్ మరో జగన్నాటకానికి తెరలేపారని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం అనంతపురం నగరంలోని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు వివేకా హత్య, కోడి కత్తి కేసుల తరహాలోనే ఈ ఎన్నికలకు ముందు జగన్‌పై రాళ్ల దాడి మరో నాటకమన్నారు. దీనికి రాష్ట్ర పోలీసులు బాధ్యత వహించాలన్నారు. బాధ్యతారహితంగా ఉన్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్నాటకానికి సానుభూతి చూసే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు.

గులకరాయితో మరో మోసం: కందికుంట



కదిరి, ఏప్రిల్ 14: సీఎం వైఎస్ జగన్ మరో మారు గులకరాయి పేరు తో కొత్త నాటకానికి తెరలేపారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019లో కోడికత్తి, బాబాయ్ హత్యతో సానుభూతి పొంది అధికారంలోకి వచ్చిన జగన్ ఈసారి గులకరాయి పేరుతో సానుభూతి పొందాలని చూస్తున్నారన్నారు.ఆయన డ్రామాలను నమ్మేవారు ఎవరూ లేరన్నారు. ముఖ్యమంత్రికి అత్యంత భద్రత ఉంటుందని, అదే సభలో నాలుగైదుమార్లు కరెంటు పోయిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిపై రాళ్లదాడి జరిగితే, పోలీసులు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. ఇది జగన్నాటకమా, పోలీసుల వైఫల్యామా అనేది తేల్చాలన్నారు. ముఖ్యమంత్రి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కందికుంట మండిపడ్డారు.

ప్రజల సానుభూతి కోసమే: సవిత



పెనుకొండ టౌన్, ఏప్రిల్ 14: అధికార దాహంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసేందుకు నాడు కోడికత్తి డ్రామా ఆడి నేడు గులకరాయిదాడి అని అంటున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో గులకరాయి డ్రామాకు తెరలేపారన్నారు. జగన్‌పై రాయితో దాడి ప్రజల సానుభూతి కుట్రలో భాగమేనన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయం వైసీపీకి పుట్టుకుందని ఈ దాడితోనైనా ప్రజల్లో సానుభూతి పొందవచ్చని డ్రామా ఆడుతున్నారన్నారు. ఇలాంటి డ్రామా ఆర్టిస్ట్ అయిన ముఖ్యమంత్రి రాష్ట్రానికి అవసరమా అన్నారు. ఈ రాళ్లదాడి ఒక బూటకమని, సైకోజగన్ నక్కజిత్తుల పన్నాగమని, ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

రాళ్ల దాడి.. జగన్నాటకమే..!

కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 14: సిద్ధం బస్సు యాత్రకు జనం నుంచి స్పందనలేకపోవడంతో సీఎం జగన్ రాళ్ల దాడి డ్రామాలు ఆడుతున్నారని, జగన్నాటకంలో అదో భాగమని దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత ఎన్నికలకు ముందు కోడి కత్తి, బాబాయ్ వివేకా హత్య పేరుతో డ్రామాలు ఆడి సానుభూతి పొందారన్నారు. ఇప్పుడు ఎన్నిక లకు ముందు రాళ్ల దాడిపేరుతో మరో కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. కరెంటు లేని సమయంలో సరిగ్గా కంటిపై భాగాన ఎలా దాడి చేశారని ప్రశ్నించారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, జగన్ మాయమాటలు నమ్మే పరిస్థితుల్లో వారు లేరని అన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై.. తికమక..!



- ఒక్కోచోట ఒక్కో రకంగా అధికారుల నిర్ణయాలు
- దరఖాస్తుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు దూరం
- ఉన్నతాధికారుల తీరుపై అసహనం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 14: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ సిబ్బంది పనితీరే చాలా కీలకం. ఉన్నతాధికారులు ఆదేశాలిస్తే క్షేత్రస్థాయిలో వాటిని పక్కాగా అమలు చేసి ఎన్నికల నిర్వహణను విజయవంతం చేసేది పోలింగ్ సిబ్బందే. అలాంటి సిబ్బంది ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే పోస్టల్ బ్యాలెట్లపై తికమకపడుతున్నారు. చాలామంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటుకు దరకాస్తు చేసుకోలేకపోతున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కోరకంగా ఎన్నికల అధికారులు నిర్ణయాలు తీసుకుంటుండడంతో సమస్యలు ఏర్పడుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరకు వీటిని పర్యవేక్షించే జిల్లా ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడం, పోస్టల్‌బ్యాలెట్ వినియోగం విధానాలపై కనీసం ప్రచారమాధ్యమాల ద్వారా తెలియజేయకపోవడం మరిన్ని విమర్శలకు తావిస్తోంది.

ఎన్నికల డ్యూటీలో పాల్గొనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో ఎన్నికలు నిర్వహించడానికి ఇప్పటికే జిల్లాస్థాయి అధికారుల టీమ్‌లు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలను నియమించారు. పీఓలు 2,552మంది, ఏపీఓలు 2,715, ఓపీఓలు దాదాపు 9వేలు, పోలీసులు దాదాపు 4వేలమంది ఇలా అందరూ కలిపి 25వేలమంది వరకు ఎన్నికల డ్యూటీలో పాల్గొంటున్నారు. ఇవికాకుండా ఎమర్జెన్సీకి సంబంధించి 33 శాఖలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్‌బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుంది. ఎన్నికల డ్యూటీకి నియమితులైన పీఓ, ఏపీఓలకు ఇప్పటికే శిక్షణ ఇవ్వడం జరిగింది. అదేరోజే వారందరితో పోస్టల్‌బ్యాలెట్‌కు వారినుంచి ఫారం-12 డీ దరఖాస్తు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే శింగనమల, రాయదుర్గం, ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో అక్కడ ఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు తమసొంత నిర్ణయాలు తీసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కేవలం ఆయా నియోజకవర్గాల్లో ఓటు ఉన్నవారితో మాత్రమే దరఖాస్తులు తీసుకున్నారు. ఇతర నియోజకవర్గాల్లో ఓటుఉంటే వారిని ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. ఆ రోజు అక్కడకు వెళితే ఎన్నికల ఆర్డర్, ఫారం-12డీ, ఇస్తే అపుడు పోస్టల్‌బ్యాలెట్ ఇస్తారు అక్కడే మీఓటు వేయవచ్చని చెప్పి పంపారు. ఎన్నికల నిబంధన మాత్రం ఉద్యోగం చేసే నియోజకవర్గంలో ఎన్నికల డ్యూటీ ఆర్డర్, ఫారం-12 దరఖాస్తు ఆ నియోజకవర్గ ఆర్‌ఓలకు ఇవ్వాలి. ఆర్‌ఓలు అక్కడనుంచి ఓటు ఉన్న నియోజవర్గానికి వారి దరఖాస్తులను పంపిస్తారు, అపుడు ఓటు ఉన్న నియోజకవర్గంలో పోస్టల్‌బ్యాలెట్ మంజూరుచేస్తారు. ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్‌లో ఓటు వేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అలా చేయకుండా ఆర్‌ఓలు ఒక్కోచోట ఒక్కో రకంగా చెప్పడంతో చాలామంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోలింగ్ బ్యాలెట్‌లకు దూరం అయ్యే పరిస్థితి నెలకొంది.

పనిచేసే నియోజకవర్గ ఆర్‌ఓలకే దరఖాస్తు ఇవ్వాలి

పోస్టల్‌బ్యాలెట్ జారీ విషయంలో ఆర్‌ఓలకు స్పష్టంగా సమాచారం ఇచ్చాం. ఏ నియోజకవర్గంలో ఉద్యోగం చేస్తున్నారో ఆ నియోజకవర్గ ఆర్‌ఓలకే పోస్టల్‌బ్యాలెట్‌కు ఫారం-12 దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి ఎవరికి ఏ నియోజకవర్గంలో ఓటు ఉందో అక్కడికి ఆ ఆర్‌ఓ ఫార్వర్డ్ చేసి పంపుతారు. పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన రోజు వెళ్లి అక్కడ బ్యాలెట్ పొంది ఓటు వేయాల్సి ఉంటుం ది. శిక్షణ రోజే పీఓ, ఏపీఓలతో బ్యాలెట్‌కు దరఖాస్తులు తీసుకెళ్లమని చెప్పాం. అయితే కొందరు సరిగా చెప్పకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఎన్నికల నామినేషన్ల వరకు పోస్టల్ బ్యాలెట్‌లకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది. ఇప్పటికైనా ఎన్నికల డ్యూటీలో ఉన్న వారు పనిచేసే నియోజకవర్గంలో ఆర్‌ఓలను కలిసి దరఖాస్తులు అందించాలి. ఓపీఓలు నియమితులైన వారు మాత్రం నేరుగా ఓటు ఉన్న నియోజకవర్గంలోనే నియామక ఉత్తర్వులు చూపించి దరఖాస్తు చేసుకోవాలి.

- ప్రభాకరరావు, డీపీఓ (పోస్టల్‌బ్యాలెట్ నోడల్ ఆఫీసర్)

ప్రభాకర్ చౌదరికి కీలక బాధ్యతలు

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం
- జోన్-5 ఎన్నికల సమన్వయకర్తగానూ బాధ్యతలు...



అనంతపురం ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరికి కీలక బాధ్యతలు అప్పగించారు. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ చౌదరిని నియమించారు. ఐదేళ్లపాటు అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఆయన వైసీపీ అరాచక పాలనపై అనేక పోరాటాలు చేశారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ నిరాహార దీక్షలు చేశారు. ఈ క్రమంలో అనంతపురం అర్బన్ టిక్కెట్‌ను ఆయన ఆశించారు. కొన్ని కారణాల నేపథ్యంలో ఆ పార్టీ అధినాయకత్వం దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఈ పరిస్థితుల్లో వైకుంఠం ప్రభాకర్ చౌదరితోపాటు పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యాయి. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలించిన పార్టీ అధిష్టానం ఆ పార్టీలో వైకుంఠం ప్రభాకర్ చౌదరికి జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. అంతే కాకుండా సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆయనకు జోన్-5 ఎన్నికల సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇంకా జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులకు పార్టీ రాష్ట్ర కమిటీలోనూ, సార్వత్రిక ఎన్నికల పరిశీలకులు, సమన్వయ కర్తలుగా నియమించారు.

ఎన్నికల పరిశీలకులు, సమన్వయకర్తలుగా పలువురికి బాధ్యతలు



నిమ్మల కిష్టప్ప అనంత పార్లమెంటు సమన్వయకర్త



దాసరి నరసింహమూర్తి పుట్టపర్తి నియోజకవర్గ పరిశీలకుడు



పూల నాగరాజు పురం పార్లమెంటు సమన్వయకర్త



శివబాల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

జిల్లాకు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులను ఎన్నికల పరిశీలకులుగా, సమన్వయకర్తలుగా నియమించారు. అనంతపురం పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్తగా మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పను నియమించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శివబాలను నియమించారు. కళ్యాణదుర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు దాసరి నరసింహ మూర్తిని సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజక వర్గం ఎన్నికల పరిశీకుడిగా నియమించారు. రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజుకు హిందూపురం పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్తగా కీలక బాధ్యతలు అప్పగించారు.

పుట్టపర్తిలో వైసీపీకి బిగ్ షాక్

- టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి లోకేశ్ సమక్షంలో వందమంది ముఖ్య నేతల చేరిక


అనంతపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. హిందూపురం పార్లమెంటు కూటమి అభ్యర్థి బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ కూటమి అభ్యర్థి పల్లె సింధూర నేతృత్వంలో వైసీపీకి చెందిన కీలక నేత, రెస్కో మాజీ చైర్మన శెట్టివారి రాజశేఖర్‌తోపాటు మరో వందమంది ముఖ్యనేతలు టీడీపీలో చేరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమయంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో చేరిన వారిలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులున్నారు. వీరందరికి నారా లోకేశ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పుట్టపర్తిలో కాపు సామాజికవర్గం బలమైన నాయకులుగా రాజశేఖర్ ఉన్నారు. ఈయన 1999లో ఆ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి దాదాపు 14 వేల ఓట్లు తెచ్చుకున్నారు. వైసీపీ నేతలు టీడీపీలో చేరిన సందర్భంగా నారా లోకేశ్ వారినుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కలిసి పనిచేసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ పార్టీల ముఖ్య నేతలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారన్నారు. పుట్టపర్తిలో టీడీపీ జెండా ఎగురవేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందరి సేవలను వినియోగించుకుంటామన్నారు. ఇదే సందర్భంలో రెస్కో మాజీ చైర్మన్ రాజశేఖర్ మాట్లాడుతూ ధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలంటే విజనరీ లీడర్ చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. చంద్రబాబు నేతృత్వంలో కలిసి పనిచేసి పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామన్నారు.



పార్టీలోకి చేరిన నాయకులతో నారా లోకేశ్, బీకే, పల్లె, సింధూర

టీడీపీలో చేరిన వైసీపీ జడ్పీటీసీ అనూష

- వందలాది కుటుంబాలు కూడా..



వసుంధరా దేవి సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

చిలమత్తూరు, ఏప్రిల్ 14: మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. బీసీ వర్గానికి చెందిన వైసీపీ జడ్పీటీసీ గొల్ల అనూషతోపాటు ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వందలాది మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర దేవి మండలంలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జడ్పీటీసీ అనూష, ఆమె మామ నాగరాజు యాదవ్ వసుంధర దేవిని ఇంటికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వసుంధర దేవి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు, మహిళలకు టీడీపీలోనే న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ ఆవిర్భవించిందే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసమని, వారి క్షేమం కోసం పార్టీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ సోదరి లోకేశ్వరి, శ్రీనివాసు, ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధి తేజశ్విని, డాక్టర్ సురేంద్ర, నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సుధాకర్, రావిళ్ల లక్ష్మీ నాగరాజు, దేమకేతేపల్లి అంజినప్ప, పరిమళ, మంగేష్, స్థానిక నాయకులు రంగా రెడ్డి, తిప్పారెడ్డి, శ్రీదేవి, బేకరీ గంగాధర్ తదితరలు ఉన్నారు.

బీసీల చూపు.. టీడీపీ వైపు..

- ప్రకాష్‌రెడ్డీ అరమీసం తీసుకునేందుకు సిద్ధంగా ఉండు
- పరిటాల సునీత, శ్రీరామ్

ధర్మవరంరూరల్, ఏప్రిల్14: బీసీల చూపు టీడీపీ వైపు ఉందని, రాప్తాడు ఎన్నికల్లో పరిటాలకుటుంబం గెలిపిస్తే అర మీసం తీసుకుంటానని ఛాలెంజ్‌కు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సిద్ధంగా ఉండాలని మాజీమంత్రి పరిటాలసునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. కనగానపల్లిలో ఆదివారం జయహోబీసీ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్థానిక సర్పంచ్ అంకే పరిమిళరామకృష్ణ ఇంటివద్దకు వెళ్లారు. వారిని స్వాదరంగా ఆహ్వానించారు. అనంతరం సర్కిల్‌లోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ సదస్సు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అంకే పరిమళ రామకృష్ణతోపాటు పాపన్న, రాజేంద్ర, అంకే రామచంద్ర, రామ్మోహన్, తలారిపోతలయ్య, అంకే వన్నూరప్ప, వడ్లచెన్నప్ప, అంకే చంద్ర, నడిపిరాజన్న, బోనాసి ఓబుళపతి, మందలఅంజి, సాకే నాగేష్, పెద్దన్న, అంకే వారాధి, పెద్దనరసింహులు, చీమల నాగభూషణ, అంకే గోవిందు, రామలింగయ్య, అంకే నాగరాజుతోపాటు దాదాపు 300మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు వారి సమక్షంలో పరిటాల సునీత, శ్రీరామ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. అదేవిధంగా భానుకోట మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, పల్లారామకృష్ణ, శివారెడ్డి, పల్లానాగేంద్ర, కుంపటికుళ్లాయప్ప, వారాధి తదితరులు పార్టీలోకి చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అంతకుమునుపు డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సొంత కార్యకర్తలకు కూడా న్యాయం చేయలేదన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీకి పనిచేసి రాప్తాడు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ వైసీపీ ప్రభుత్వంలో అనేకమంది బీసీలు ఇబ్బందులు పెట్టినా, వారిని చంపేసినా సీఎం జగన్‌గానీ, వారి ఎమ్మెల్యేలను గానీ స్పందించినా దాఖలాలు లేవన్నారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని బీసీలకు పూర్తిగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెంవెంకటేష్, కన్వీనర్‌యాతం పోతలయ్య, ఎంపీటీసీ బిల్లేభాస్కర్, ముకుందనాయుడు, పసల వెంకటేష్, పూజారినాగభూషణం, సుధాకర్‌చౌదరి, బట్టాసురేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ప్రత్యేక న్యాయాధికారి శ్రీనివాసులు



మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక న్యాయాధికారి శ్రీనివాసులు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 14: అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రత్యేక న్యాయాధికారి శ్రీనివాసులు సూచించారు. జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రత్యేక న్యాయాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాలు జరిగినపుడు చాకచక్యంగా వ్యవహరించి అదుపు చేయడంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల్లో చేపట్టనున్న కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఫైర్ సిబ్బంది చేసిన విన్యాసాలను ఆయన తిలకించారు. ఫైర్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమలో అసిస్టెంట్ అగ్నిమాపకశాఖ అధికారి లింగమయ్యతోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి



గోవిందప్ప మృతదేహం

మడకశిర రూరల్, ఏప్రిల్ 14: మండలంలోని గోవిందాపురం పంచాయతీ దిగువగొల్లహట్టి గ్రామానికి చెందిన గోవిందప్ప(60) వడదెబ్బ తగిలి మృతి చెందిన ట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గొర్రెల కాపరి అయిన గోవిందప్ప ఆదివారం ఉదయం తన గొర్రెలను మేతకోసం గ్రామ సమీపంలోని కొండ ప్రాంతానికి తోలు కెళ్లాడు. సాయంత్రం 5 గంటలకు గొర్రెలు తిరిగి వచ్చాయి కానీ, గోవిందప్ప రాలే దు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు గొర్రెలు మేతకెళ్లిన ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు రాత్రి 8గంటల సమయంలో కొండప్రాంతంలో గోవిం దప్ప మృతదేహన్ని కనుగొన్నారు. పగలంతా గొర్రెల వెంట ఎండలో తిరగడంతో వడదెబ్బ సోకి కొండప్రాంతంలోనే మృతిచెందినట్లు వారు తెలిపారు. మృతదేహన్ని గ్రామానికి తీసుకొచ్చినట్లు తెలిపారు.

విద్యుత్ అధికారులపై కేసు

నల్లమాడ, ఏప్రిల్ 14: హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ శనివారం స్వర్ణాంధ్ర సాకారం యాత్రలో భాగంగా కదిరి నుంచి నల్లమాడ మీదుగా కొత్తచెరువుకు వెళ్లారు. రాత్రి 7:30గంటలకు ఆయన నల్లమాడ క్రాస్ చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడ విద్యుత్ పోవడంతో అంధకారం ఏర్పడింది. దీంతో తొక్కిసలాట జరిగింది. కొందరు బాలయ్యతో కరచాలనానికి ఎగబడ్డారు. గమనించిన సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ అందరినీ పక్కకు పంపించేశారు. వెంటనే సీఐ విద్యుత్ సిబ్బందిని పిలిపించి నల్లమాడలో కరెంటు ఉంది, ఇక్కడ ఎందుకు పోయిందని ప్రశ్నించారు. ఉన్నట్టుండి కరెంట్ తీస్తే జనంలో ఎవరికైనా ఏమైనా జరిగితే ఎవరిది బాధ్యత అని నిలదీశారు. ఇందుకు విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఆగ్రహించిన సీఐ.. నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ విద్యుత్ శాఖాధికారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో మరో స్టోర్ డీలర్

అనంతపురంరూరల్, ఏప్రిల్ 14: మండలంలోని స్టోర్ డీలర్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీలోని సుందరయ్య కాలనీ, బీఎస్‌ఆర్ కాలనీ, జాకీర్‌కొట్టాల, సియోన్‌పురం, దండోర కాలనీ, ఆదర్శకాలనీ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ స్టోర్ డీలర్ ప్రమీల పాల్గొన్నారు. ప్రచార వాహనం ఎక్కిమరీ ప్రచారం చేశారు. శుక్రవారం పూలకుంటగ్రామంలో జరిగిన ప్రచారంలో శంకరయ్య అనే స్టోర్ డీలర్ పాల్గొన్నారు.



ప్రకాష్‌రెడ్డి ప్రచార వాహనంలో స్టోర్ డీలర్ ప్రమీల (వృత్తంలో..)

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

రామగిరి, ఏప్రిల్ 14: రామగిరి మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు పరిటాల సిద్దార్థ సమక్షంలో ఆదివారం వెంకటాపురంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

అనంతపురంరూరల్ : మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ పిల్లిగుండ్ల కాలనీకి చెందిన వైసీపీకి చెందిన 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. ఆదివారం నగరంలోని మాజీ మంత్రి పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో పరిటాల సిద్దార్థ ఆధ్వర్యంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

జగన్‌పై రాళ్ల దాడి.. బూటకం

గార్లదిన్నె, ఏప్రిల్ 14: సీఎం జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన రాళ్లదాడి ఓ బూటకమని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య ఆరోపించారు. ఆదివారం మర్తాడులో ఆయన మాట్లాడుతూ... వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. దీంతో ప్రజల్లో సానుభూతి తెచ్చుకోవడానికి వైసీపీ నాయకులపై రాళ్లదాడి చేయించి ఉంటారని ఆరోపించారు. ఇందుకు 2019 ఎన్నికల్లో జరిగిన కోడికత్తే నిదర్శనమన్నారు. ఎన్నికల్లో సమయంలోనే జగన్మోహన్‌రెడ్డిపై దాడులు జరుగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోం దన్నారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా బంద్ చేయించిన సమయంలోనే దాడి జరగడం ఏంటని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు ఎన్ని కుయుక్తులు, కుట్రలు చేసిన త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో గోరకాటి వెంకటేసు, గోసుల సుబ్బయ్య, ఆవుల శీనా, బీరే సుబ్బన్న, యల్లప్ప, శ్రీధర్, బూడిద కిష్ట పాల్గొన్నారు.

ఉప్పరపల్లిలో టీడీపీ ప్రచారం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 14: మండలంలోని ఉప్పరపల్లిలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి... బాబు సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఇందులో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాముదాయి వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగేమురళి పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ: మండలంలోని అక్కంపల్లి పంచాయతీ సదాశివ కాలనీలో సోమవారం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ఉంటుందని, మాజీ మంత్రి పరిటాల సునీత హాజరవుతారని అన్నారు.

టీడీపీ విజయానికి బీసీలంతా శ్రమించాలి

రాప్తాడు, ఏప్రిల్ 14: ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం బీసీలంతా కలిసి శ్రమించాలని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప తెలిపారు. మండలంలోని మరూరులో ఆదివారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీల అభివృద్ధికి నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, కురుబ సాధికార సమితి కన్వీనర్ గంగలకుంట రమణ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల టీడీపీ కన్వీర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని తలుపూరులో ఆదివారం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారెక్క, మండల నాయకులు ఆనంద్, నాగేంద్ర, సూరి, ఆనంద్, బాలు, గోపీ పాల్గొన్నారు.

కోలాహలంగా బాలయ్య యాత్ర

గార్లదిన్నె, ఏప్రిల్ 14: స్వర్ణాంధ్ర సాకార యాత్ర పేరుతో హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ చేపట్టిన యాత్ర ఆదివారం గార్లదిన్నెలో కోలాహలంగా సాగింది. కేశవరెడ్డి గెస్ట్ హౌస్‌లో బాలయ్య ఉన్నారన్న విషయాన్ని తెలుసుకున్న అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆ గెస్ట్ హౌస్‌కు తరలివెళ్లారు. బాలయ్యతో సెల్ఫీలకు ఎగబడ్డారు. అనంతరం అక్కడి నుంచి 44వ జాతీయ రహదారి మీదుగా బయలుదేరి కల్లూరుకు వచ్చారు. బాలయ్య కోసం ఎదురుచూస్తున్న అభిమానులు జై బాలయ్య పాటకు చిందేశారు.

గూగూడులో కాంగ్రెస్ ప్రచారం

నార్పల, ఏప్రిల్ 14: గూగూడులో కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి శైలజనాథ్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, వజ్జల మల్లికార్జున, దాదాగాంధీ, సీపీఎం నాయకులు ఓ నల్లప్ప పాల్గొన్నారు.

పోతులయ్యస్వామికి ఘనంగా జ్యోతులబోనాలు



చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 14: మండలంలోని చందమూరులో వెలసిన శ్రీపోతులయ్య స్వామికి జ్యోతులు, బోనాల ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది పండుగ అనంతరం ఇక్కడ జ్యోతులబోనాల ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మహిళలు పెద్దఎత్తున జ్యోతులబోనాలు నెత్తినపెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి పోతలయ్య స్వామి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం గావుల మహోత్సవాన్ని కూడా నిర్వహించారు. స్థానికులతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్, డిగ్రీ నుంచే దృష్టి పెడితే 'సివిల్స్' సులభం



ఏకే ఖాన్‌ను సన్మానిస్తున్న నారాయణ ఐఏఎస్ అకాడమీ, కళాశాల సిబ్బంది

అనంతపురం విద్య, ఏప్రిల్ 14: సివిల్స్ పరీక్షలపై గ్రాడ్యుయేషన్ తర్వాత దృష్టి పెడుదాం అనుకోకుండా ఇంటర్, డిగ్రీ నుంచే గురి పెట్టడం వల్ల సివిల్స్ సాధించడం సులభతరం అవుతుందని తెలంగాణా రిటైర్డ్ డీజీ ఏకె ఖాన్ అన్నారు. ఆదివారం నగరంలోని టీటీడీ కళ్యాణమండపంలో సివిల్స్ పరీక్షలపై నారాయణ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక రోజు ఉచిత వర్క్‌షాప్‌లో ఆయన విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధానంగా సివిల్స్‌ను ఎంచుకున్న తర్వాత...ఆ పరీక్షలే తన లక్ష్యంగా భావించి ధృడ నిశ్చయంతో ముందకెళ్లాలని సూచించారు. ఐఏఎస్, ఐపీఎస్ ఇతర సివిల్ సర్వీసులు సాధించాలంటే..ప్రిపరేషన్ చాలా త్వరగా ప్రారంభించాలన్నారు. అభ్యర్థులు ఒక ప్రశ్నపై 360 డిగ్రీల్లోనూ ఆలోచించగలిగే గుణాన్ని అలవచ్చుకోవాలన్నారు. ఎందరో గ్రామీణులు క్లర్కులుగా కూడా పనిచేసి... ఐఏఎస్‌లుగా ఎదిగిన వారు ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నారాయణ ఐఏఎస్ అకాడమీ డీజీఎం,ఆర్‌అండ్‌డీ హెచ్ శివనాథ్, వైస్ ప్రెసిడెంట్ నాగేంద్ర ప్రతాప్, నారాయణ కళాశాలల కోర్ డీన్ బద్రీనాథ్, డీన్ వెంకటరామిరెడ్డి, పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామగిరి, ఏప్రిల్ 14: రామగిరికి చెందిన ఓ వ్యక్తి బైక్‌లో 384 కర్ణాటక మద్యం ప్యాకెట్లను తరలిస్తుండగా.. స్థానిక చెక్‌పోస్టు వద్ద ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మద్యాన్ని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

నేడు సామూహిక ధర్మోపనయనాలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 14 : బ్రాహ్మణ ఉపనయన సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు మొదటి రోడ్డులోని కాశీ విశ్వేశ్వర కోదండరామాలయంలో సామూహిక ధర్మోపనయనాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు యన్.శివరామ్, టీఎస్ సాయిశివరామ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బ్రాహ్మణులు విరివిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పశువుల సంత ఆదాయం రూ.3.29 లక్షలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 14: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,29,610 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,67,350, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,62,260 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఎరువుల డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీలో నలుగురికి చోటు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 14 : రాష్ట్ర ఎరువులు, పురుగు మందులు, క్రిమి సంహారక మందుల డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఆదివారం గుంటూరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో ఈసీ సభ్యులు ఆ సంఘం జిల్లా నాయకులు సిరిగుప్ప వెంకటేష్, సురేష్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, రవికు చోటుదక్కింది. ఈ సందర్భంగా కొత్త ఈసీ సభ్యులకు రాష్ట్ర నాయకులు సన్మానించారు.

విజయానికి సహకరించండి

ప్రభాకర్ చౌదరిని కోరిన దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 14: తన విజయం కోసం సహకరించాలని దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని కోరారు. ఆదివారం స్థానిక వైకుంఠం ప్రభాకర్ చౌదరి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను దగ్గుబాటి మర్యాద పూర్వకంగా కలిశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పార్టీ కోసం పనిచేసిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు అనేక మంది ఉన్నారని, వారందరినీ కలుపుకొని ముందుకు వెళితే మంచి ఫలితాలు ఉంటాయని వైకుంఠం సలహా ఇచ్చినట్లు సమాచారం. పార్టీ కోసం పనిచేసిన అందరినీ కలుసుకొని ముందుకు వెళతానని దగ్గుబాటి చెప్పినట్లు తెలిసింది.

అంబేడ్కర్‌కు నివాళి

స్థానిక జడ్పీ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. అనంతరం దళిత సంఘాల ఆధ్వర్యం లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, నాయకులు గాజుల ఆదెన్న, రాయల్ మురళీ, బుగ్గయ్య చౌదరి, వెంకటప్ప, లక్ష్మీనరసింహ, దళవాయి వెంకటనారాయణ, సిమెంట్ పోలన్న పాల్గొన్నారు.


ప్రభాకర్ చౌదరిని కలిసిన దగ్గుబాటి ప్రసాద్

ప్రకాశ్.. దొంగ ఓట్లతో గెలిచాడు

పరిటాల సునీత, శ్రీరామ్ ఆరోపణ


సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల సునీత

రామగిరి, ఏప్రిల్ 14: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి గత ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలిచాడని కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరాం విమర్శించారు. వెంకటాపురంలోని వారి నివాసంలో ఆదివారం రాత్రి నసనకోట, మాదాపురం పంచాయతీలకు సంబంధించిన తొమ్మిది గ్రామాల టీడీపీ శ్రేణులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. పరిటాల శ్రీరాములు, పరిటాల రవీంద్ర హయాం నుంచి అండగా ఉండి నడిపిస్తున్నారని, ఈ ఎన్నికలలో కూడా పార్టీ గెలుపు కోసం కలిసి పనిచేయాలని సూచించారు. గత ఎన్నికలలో ప్రకాశ్‌రెడ్డి దొంగ ఓట్లతో తొలిసారిగా తాము ఓడామన్నారు. ప్రస్తుతం ప్రజలు ప్రకాశ్‌ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ 28 రోజులూ టీడీపీ గెలుపు కోసం అందరూ కలసికట్టుగా కృషి చేయాలన్నారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం

కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్ 14: రాష్ట్రంలో ఐదేళ్లగా రాజారెడ్డి రాజ్యాంగం అమల్లో ఉందని, ఇక 35 రోజుల్లో ఆ పాలన ముగుస్తోందని కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ దళిత సంఘల నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాలర్పించిన ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలు అమలు కావాలంటే ఒక్క చంద్రబాబు వల్లే సాధ్యమని, టీడీపీ గెలిస్తేనే రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, స్వేచ్ఛ సాధ్యమన్నారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు చిన్న ఆంజినేయులు, బండారు కుళ్ళాయప్ప, ఓబిలేసు, టీడీపీ నాయకులు దేగల కృష్ణమూర్తి, మారుతి నాయుడు, ఆదినారాయణ, జిలానీ, వీరనారాయణ, బీజేపీ నాయకుడు బొమ్మన ఓబిరెడ్డి, జనసేన నాయకుడు తోట ఓబిలేసు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బండారు శ్రావణిశ్రీ

గోడౌన్‌లో అగ్నిప్రమాదం.. రూ. 2 కోట్ల ఆస్తినష్టం!

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 14: స్థానిక గుత్తి రోడ్డులోని హనుమాన్ గోడౌన్‌లో ఆదివారం ఉదయం 11.15 గంటలకు భారీ అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లారు. ఆ సిబ్బంది చేరుకొనేలోపే మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. అక్కడ ఉన్న ఫ్రిజ్‌లు, ఎయిర్ కూలర్, ఏసీలు ఆహుతయ్యాయి. మంటలు అదుపు చేయడం కష్టతరంగా మారింది. జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ అగ్నిమాపకశాఖాధికారి లింగమయ్య సంఘటన స్థలానికి చేరుకొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. చుట్టుపక్కల నివాస గృహాలు, సమీపంలోనే అయిల్ మిల్ ఉండటంతో ప్రజలు ఆందోళన పడ్డారు. మంటలు ఆర్పడానికి నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో మున్సిపల్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. ఎట్టకేలకు అతి కష్టం మీద ఫైర్ సిబ్బంది ఆ మంటలు అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్‌తోనే ఈ అగ్నిప్రమాదం జరిగిందని, దాదాపు రూ.2 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగింటుందని ఆ గోడౌన్ యజమాని గురుప్రసాద్ అంటున్నారు. జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి మాత్రం రికార్డులు పరిశీలించిన తరువాతే నష్టం ఎంత అన్నది చెబుతామన్నారు. పూర్తి స్థాయిలో రికార్డులు అప్పగించాలని, అందుకు అనుగుణంగా విచారణ చేసి నష్టాన్ని నిర్ధారిస్తామని అన్నారు. కాగా, ఈ గోడౌన్‌కు సంబంధించి ఎలాంటి అనుమతులూ లేవని, ఎలాంటి సేఫ్టీ ప్రికాసన్స్ లేకపోవడంతోనే ప్రమాద తీవ్రత పెరిగిందని ఫైర్ అధికారులు చెపుతున్నారు.


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

వామపక్షాలతోనే సమాజ శ్రేయస్సు

అనంతపురం కల్చరల్ : రానున్న ఎన్నికల్లో 'ఇండియా' వేదిక వామపక్ష లౌకిక అభ్యర్థులను గెలిపించుకోవడం వల్లే సమాజ శ్రేయస్సు సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వీకే భవన్‌లో సీపీఎం నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడా రు. పదేళ్లగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నిరంగాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేసిందన్నారు. ఎక్కువ మంది ఎంపీలున్నా రాష్ట్ర అభివృద్ధికి అవసర మైన నిధులను సాధించడంలో సీఎం జగన్ ఘోరంగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఇండియా కూటమి అభ్యర్థి సీపీఐ జాఫర్, కాంగ్రెస్ నగరాధ్యక్షు డు దాదా గాంధీ, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు ముష్కిన్, వెంకట నారాయణ, నగర కమిటీ నాయకులు ప్రకాష్, వలి, ఎంపీటీసీ రమీజా పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణోత్సవం

ఆత్మకూరు : పంపనూరు సుబ్రహ్మ ణ్యేశ్వరుడి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ కట్టపై ఉంచి.. కల్యాణోత్సవం నిర్వహించారు.






నివాళులర్పిస్తున్న డీఈఓ వరలక్ష్మి, ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి, సీకేపీలో నివాళులర్పిస్తున్న నాయకులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేవీవీ, కాంగ్రెస్ నాయకులు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని కేఎస్ఆర్ హైస్కూల్‌లో డీఈఓ వరలక్ష్మి నివాళులర్పించారు. నగరంలోని జడ్పీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. అలాగే అనంతపురం రూరల్ మండలం, చెన్నేకొత్తపల్లి, రామగిరి, గార్లదిన్నె, రాప్తాడు, బుక్కరాయసముద్రం, నార్పలలోనూ అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సోములదొడ్డిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద.. కోటంకలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు



రాప్తాడు టీడీపీ కార్యాలయంలో.., రామగిరిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

అలరించిన హాస్యవల్లరి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 14: వివేకానంద యోగా కేంద్ర మాసవారీ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం షిర్డి నగర్‌లోని వివేకానంద భవన్‌లో నిర్వహించిన హాస్యవల్లరి అలరించింది. మానవత రక్తదాతల సంస్థ తరిమెల అమరనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి యోగా శిక్షకులు కోడూరు సుధాకరమూర్తి, కటకం కృష్ణవేణి, న్యాయవాది నామసేవ హరికృష్ణ హాజరై తమదైన శైలిలో చలోక్తులతో హాస్యం పండించారు. దాదాపు 50కు పైగా హస్య సన్నివేశాలను ప్రదర్శించారు. అనంతరం వివేకానంద యోగాకేంద్ర అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సత్యానందం, పుల్లన్న, దంతవైద్యుడు లక్ష్మీనారాయణ, డాక్టర్ నారాయణప్ప, దివాకర్, విశ్రాంత డిప్యూటి కలెక్టర్ గోవిందరాజులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు కోసం పనిచేద్దాం : వైకుంఠం


మాట్లాడుతున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 14: చంద్రబాబునాయుడు సీఎం కావడం కోసం ఈ ఎన్నికల్లో అందరం కలిసి పనిచేసి.. టీడీపీని గెలిపిద్దామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం లోని తన నివాసంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణతో కలిసి నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమ య్యారు. ఆయన మాట్లాడుతూ... వైసీపీ ఐదేళ్ల పాలనలో పోరాడామన్నారు. తెలుగుదేశం పార్టీ, చంద్రబాబునాయుడు కోసం అహర్నిశలు కష్టపడ్డామన్నారు. ఐదేళ్లల్లో తనతో పాటు నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలపై అక్రమ కేసులు పెట్టారన్నారు. కోర్టులో కేసులపై సొంతడబ్బు పెట్టుకొని ముందుకు వెళ్లామన్నారు. వీటన్నింటినీ పార్టీ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, భూకబ్జాలు చేయలేదన్నారు. తాజాగా తాను డబ్బులు తీసున్నారని కొందరు ప్రచారం చేశారని, డబ్బుతో తనను ఎవరూ కొనలేరని అన్నారు. చంద్రబాబు ఇటీవల తనను పిలిపించి మాట్లాడారని, కొన్ని కారణాల మూలంగా టికెట్ ఇతరులకు కేటాయించాల్సి వచ్చిందని, ప్రస్తుత క్లిష్టపరిస్థితుల్లో పార్టీ కోసం పనిచేయాలని ఆయన సూచించారని అన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను విస్మరించబోమని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. తనను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

శ్రీచైతన్య కళాశాల విద్యార్థుల హవా


విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

అనంతపురం విద్య, ఏప్రిల్ 14: ఇంటర్ పరీక్షల ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కళాశాల ఏజీఎం మురళీకృష్ణ, ప్రిన్సిపాళ్లు ఆదివారం అన్నారు. ఆ విద్యార్థులను అభినందించిన ఆయన మాట్లాడారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో అబ్దుల్ రకీబ్ నజీర్ 465 మార్కులు, మరో తొమ్మిది మంది విద్యార్థులు 460కిపైగా మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో మనోజ్ఞ, షేయిక్ షబాజ్‌కు 434 మార్కులు, మరో ఎనిమిది మందికి 430 కి పైగా మార్కులు వచ్చాయన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో వర్షితకు 983 మార్కులు, బైపీసీలో పఠాన్ సానియా ఖనమ్‌కు 982 మార్కులు, మరో ఐదుగురికి 980కిపైగా మార్కులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఆంజినేయులు, దుర్గేష్, కిషోర్ కుమార్, రవికుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీఓ రాష్ట్ర నేతలకు ఆత్మీయ సన్మానం


రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న నేతలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 14 : కొత్తగా ఎన్నికైన ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తంనాయుడును జిల్లా సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో సంప్రదిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దస్తగిరి రెడ్డి, ప్రసాద్ యాదవ్, జే. మాధవ, రంజిత్ నాయుడు, కృష్ణారెడ్డి, జానకీ, తులసీ, రత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజేశ్వరీ, మహిళా విభాగం జిల్లా ఛైర్‌పర్సన్ జమీలాబేగం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 14: ఆత్మకూరు మండలం వడ్డుపల్లికి చెందిన ఓంప్రకాష్ (21) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతను అనంతపురం నగరంలోని రిలయన్స్ మార్ట్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి బైక్‌లో అనంతపురం బయలుదేరాడు. అనంతపురం రూరల్ మండలంలోని ఎస్‌జేఆర్ స్కూల్ ఎదుట డీజిల్ లేక రోడ్డు పక్కన నిలిచిపోయిన ఓ ట్రాక్టర్‌ను ఢీ కొన్నాడు. దీంతో అతను అక్కడికక్కడే మరణించాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ...: ప్రభుత్వాసుపత్రి ఎదుట యాచకవృత్తితో జీవనం సాగిస్తున్న శ్రీరాములు (50) శనివారం రోడ్డు దాటుతుండగా జీపు ఢీకొంది. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అతను మరణించాడు.

ఇద్దరికి తీవ్రగాయాలు


పూర్తిగా చేతిని కోల్పోయిన అక్షర

ధర్మవరంరూరల్: కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బద్దలాపురం గ్రామానికి చెందిన సురేష్, తన రెండేళ్ల కూతురు అక్షరతో కలిసి బైక్‌పై ధర్మవరం నుంచి కనగానపల్లికు బయలుదేరాడు. ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డుపక్కకు దూసుకెళ్లడంతో ఇద్దరు రాళ్లపై పడ్డారు. దీంతో సురేష్ తలకు తీవ్రగాయాలు కాగా... అక్షర కుడిచేయి పూర్తిగా తెగి కిందపడిపోయింది. 108 వాహనంలో వారిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. కనగానపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురికి గాయాలు

ఉరవకొండ : మండలంలోని పెన్నహోబిలం వద్ద ఆటోను కారు ఢీకొట్టిన సంఘటనలో నలుగురు గాయపడ్డారు. అనంతపురానికి చెందిన లింగన్న, ప్రసాద్ కుటుంబసభ్యులతో పెన్నహోబిలానికి దర్శనానికి వచ్చారు. దర్శనం చేసుకుని వెళ్తుండగా కారు ఆటోను ఢీకొనడంతో ఆటోలోని ప్రసాద్, అలివేలు, లింగప్ప, భాగ్యమ్మ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ రెడ్డి కొత్త డ్రామా

● జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు



గుమ్మఘట్ట, ఏప్రిల్ 14: తనపై రాళ్లదాడి చేశారంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో డ్రామాకు తెరలేపాడని జడ్పీ మాజీ చైర్మన్, వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పూల నాగరాజు ఎద్దేవా చేశారు. రాయదుర్గంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ కుట్ర రాజకీయాలను దుయ్యబట్టారు. తమ నేతపై హత్యాయత్నం జరిగిందంటూ వైసీపీ నాయకులు చేపట్టిన నిరసనలను ఆయన తప్పుబట్టారు. గతంలో వైఎస్ వివేకానందరెడ్డిని చంద్రబాబే చంపించారని అబద్ధపు ప్రచారం చేశారన్నారు. కోడికత్తి డ్రామా కేసులో దళిత యువకుడిని ఐదేళ్లు జైల్లో పెట్టించారన్నారు. ఈ కేసులో నిజాలేంటో ప్రజలకు అర్థం అయిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై నిన్న జరిగిన దాడి ముందస్తు వ్యూహంలో భాగమేనని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని కుట్రలు, డ్రామాలకు తెరలేపినా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఆపలేరన్నారు. రాష్ట్రంలో 140కిపైగా సీట్లు సాధించి ఎన్డీయే కూటమి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి: ఆర్వో



పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో కేతన్‌గార్గ్

ఉరవకొండ, ఏప్రిల్ 14: ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్వో, జేసీ కేతన్‌గార్గ్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీవోలు, ఏపీవోలకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పీవోలు, ఏపీవోల పాత్ర కీలకమన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా కేటాయించిన విధులను నిర్వహించాలన్నారు. అనంతరం ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని జేసీ తనిఖీ చేశారు. ఈఆర్వో శిరీష్, ఎంపీడీవో అమృత్‌రాజ్, తహసీల్దార్లు శ్రీనివాసులు రత్నరాధిక, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఈవీఎంలు వచ్చేశాయ్..!



స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న ఆర్వో రాణి సుస్మిత

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి ఈవీఎంలు ఆదివారం చేరాయి. ఈవీఎంలను పట్టణంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. రిటర్నింగ్ అధికారి రాణి సుస్మిత, డీఎస్పీ శ్రీనివాసులు ఈవీఎంల భద్రత పనులను పర్యవేక్షించారు.

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి



మాట్లాడుతున్న ఓబులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 14: రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్న బీజేపీని సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కాలనీలో ఆదివారం సీపీఎం నియోజకవర్గ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ రెండు పర్యాయాలు అధికారం చేపట్టిన తరువాత దేశ అభివృద్ధి వైపు తీసుకుపోకుండా కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పనంగా ఇచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏపీకి రావాల్సిన ప్రత్యేక హోదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, కరువు మండలాల సహాయక చర్యలను గాలికి వదిలేసిందన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బీ శ్రీనివాసులు, నాయకులు శ్రీనివాసులు, మారుతి ప్రసాద్, దాసరిశ్రీనివాసులు, కసాపురం రమేష్, సాకేనాగరాజు, నిర్మలమ్మ, హనిమిరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ మాజీ కార్యదర్శి మృతి



సంజీవరాయప్ప (ఫైల్)

గుంతకల్లు, ఏప్రిల్14: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజనల్ మాజీ కార్యదర్శి టీ సంజీవరాయప్ప (85) ఆదివారం మృతిచెందారు. రైల్వే డివిజన్‌లో సంజీవరాయప్ప స్టేషన్ మాస్టరుగా విధులను నిర్వర్తిస్తూ ద.మ.రై. మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజనల్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1991-95 సంవత్సరాల మధ్య ఈయన యూనియన్ సెక్రెటరీగా పనిచేశారు. పాతికేళ్ల కిందట రిటైరయ్యారు. రేణిగుంటలో నివసిస్తూ వృద్ధాప్యం కారణంగా మరణించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. సంజీవరాయప్ప మరణంపై యూనియన్ నాయకులు విజయకుమార్, మస్తాన్ వలి, ఇతర నాయకులు తమ సంతాపాన్ని తెలిపారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 14: పట్టణంలో ప్రజలు అధిక సంఖ్యలో సంచరిస్తున్న ప్రాంతాల్లో మజ్జిగ, చలివేంద్రాలను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం స్వచ్ఛంద సంస్థ వారు అనేక చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రస్తుతం కోడ్ ఉన్నందున ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. అధికారులు స్పందించి జనసంచారం ఉన్న చోట్ల చలివేంద్రాలు మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

రేపు సాధారణ సమావేశం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 14: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 16వ తేదీన సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రతిభా విద్యార్థులకు పతకాల అందజేత



విద్యార్థినికి కాంస్య పతకాన్ని అందిస్తున్న దృశ్యం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 14: ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సిల్వర్ మెడల్స్‌ను ఆదివారం అందజేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కలలు కన్న ఆశయాలను ప్రతి విద్యార్థి నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున, లాయర్ వాహబ్ సూచించారు. స్థానిక ఎన్జీఓ భవనంలో అంబేద్కర్ 133వ జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. నియోజకవర్గంలో 981 మార్కుల నుంచి 975 వరకు గవర్నమెంట్, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం సంతోషించతగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థులకు సిల్వర్ మెడల్స్ అందజేశారు. ఏఐవైఎఫ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొత్రేష్, ఏఐవైఎఫ్ తాలూకా కార్యవర్గ సభ్యులు యోగేంద్ర, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాటకాలరాయుడిని గద్దె దించుదాం

● మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు



హనుమాపురంలో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి కాలవ

కణేకల్లు, ఏప్రిల్ 14: రాష్ట్ర ప్రజలతో చెలగాటలాడుతూ నాటకాలరాయుడిగా మారిన సైకో జగన్‌ను గద్దె దించేందుకు ప్రజలంతా కంకణబద్ధులు కావాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని హనుమాపురం గ్రామంలో జనసేన ఇన్‌చార్జి మంజునాథ్‌గౌడతో కలిసి ఆదివారం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్నికల ముందు జనాల సానుభూతి పొందేందుకు జగన్ ఏదో నాటకానికి ఆజ్యం పోస్తుంటాడని, ఈ ఎన్నికల్లో కూడా ప్రజల సానుభూతి పొందేందుకు తమపై రాళ్లదాడి జరిగిందంటూ సరికొత్త నాటకానికి తెరలేపాడన్నారు. జగన్ జీవితమంతా అవినీతిమయమని అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఎంతటికైనా తెగించడానికి సిద్ధంగా ఉన్నాడని కాలవ మండిపడ్డారు. ప్రజలు ఇటువంటి జగన్ గురించి క్షుణ్ణంగా ఆలోచించి టీడీపీకి పట్టం కట్టాలని కోరారు. ఎంపీటీసీ నరేంద్ర, తూర్పింటి రఘు, హరిదాసు, రామచంద్రప్ప, కన్వీనర్ లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, టీటీ రమేష్, ఎస్‌కే మల్లికార్జున, కళేకుర్తి సుదర్శన్, మారుతి, బాయినేని నవీన్, అనిల్, రుద్రముని, జయశీలారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటా ప్రచారం

గుమ్మఘట్ట: మండలంలోని మారెంపల్లి, దేవరెడ్డిపల్లి గ్రామాలలో ఆదివారం టీడీపీ యువనాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. కాలవ భరత్, మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, మాజీ కో ఆప్షన్ మెంబర్ ఉస్మాన్, స్థానిక నాయకులు సదాశివ, సంజీవ, కొండయ్య, రామాంజినేయులు, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు.

కాలవ సతీమణి ప్రచారం

రాయదుర్గంరూరల్: రాయదుర్గం నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి కాలవ శ్రీనివాసులు గెలుపునకు సహకరించాలని ఆయన సతీమణి విజయలక్ష్మి కోరారు. ఆదివారం పట్టణంలోని 13 వవార్డులో ఎన్నికల ప్రచారాన్ని వార్డ్ ఇన్‌చార్జి నాగరాజునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌన్సిలర్లు జ్యోతి, పద్మ, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకం టీడీపీ..

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు



పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 14: ప్రజలు టీడీపీపై నమ్మకం పెట్టుకున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆదివారం ఉదయం కసాపురం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో పట్టణంలోని పలు వార్డులు, గ్రామాల నాయకులు ఆ పార్టీలో చేరారు. వారికి గుమ్మనూరు జయరాం పసుపు కండువాలను వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. జయరాం మాట్లాడుతూ పార్టీలో తమకు తగిన ప్రాధాన్యం లభించలేదన్న కారణంగా పలువురు వేరే పార్టీకి వెళ్లారని, మరికొందరు స్తబ్దుగా ఉండిపోయారని తెలిపారు. మాజీ నాయకులందరూ వచ్చి చేరుతుండటం సంతోషించదగ్గ విషయమన్నారు. నాలుగేళ్ల నుంచి పార్టీలో లేకుండాపోయిన మాజీ కౌన్సిలరు అంజి ఆధ్వర్యంలో 50 కుటుంబాలవారు, 28వ వార్డు ఇన్చార్జి జయమ్మ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు, పామిడి, గుత్తి మండలంలోని పూలకుంట గ్రామానికి చెందిన పలువురు టీడీపీలోకి చేరారు. గుమ్మనూరు నారాయణ స్వామి, టీఎస్ కృష్ణారెడ్డి, బండారు ఆనంద్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, కే కృపాకర్, పాల మల్లికార్జున, బండి లక్ష్మీదేవి, మహదేవ్ పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు: టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆదివారం గుంతకల్లు పట్టణం, మండలంలోని పాతకొత్తచెరువు, దంచెర్ల, గొల్లలదొడ్డి గ్రామాల్లో జయరాం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 6వ వార్డులో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కేసీ హరి, పాల మల్లికార్జున, రాయల రామయ్య, గోపాల్, షణ్ముఖాంజనేయులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మండలంలోని మాముదూరు, అబ్బేదొడ్డి గ్రామాల్లో ఆదివారం గుమ్మనూరు జయరాంను గెలిపించాలని ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణ, శ్రీనివాసులు జోరుగా ప్రచారం నిర్వహించారు. గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి గుమ్మనూరును ఆశీర్వదించాలని వారు కోరారు. మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌దాస్, మాజీ ఎంపీటీసీ రంగారెడ్డియాదవ్, సర్పంచు భరత్, మాజీ సర్పంచులు శ్రీనివాసచౌదరి, వెంకటరాముడు, నారాయణస్వామి, నాయకులు రవితేజ, కిష్ట, శివశంకర్, పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు.. నలుగురికి గాయాలు

ఉరవకొండ,ఏప్రిల్ 14: మండలంలోని పెన్నహోబిలం వద్ద ఆటోను కారు ఢీకొట్టిన సంఘటనలో నలుగురు గాయపడ్డారు. అనంతపురానికి చెందిన లింగన్న, ప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి పెన్నహోబిలానికి దర్శనానికి వచ్చారు. దర్శనం చేసుకుని వెళ్తుండగా కారు ఆటోను ఢీకొనడంతో ఆటోలోని ప్రసాద్, అలివేలు, లింగప్ప, భాగ్యమ్మలకు గాయాలు అయ్యాయి. గాయపడిపడిన వారిని చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 14: మండలంలోని సజ్జలదిన్నె గ్రామానికి చెందిన తలారి రమేష్ (35) ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. రమేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కొన్నిరోజులుగా మద్యానికి బానిస కావడంతో కూలీ డబ్బులను ఇంట్లో ఇవ్వకుండా మద్యానికి ఖర్చుచేసేవాడు. మరిన్ని డబ్బులు కావాలని భార్య సీతను వేధించేవాడు. కుటుంబపోషణపై తరచూ ఇద్దరూ గొడవపడేవారు. దీంతో జీవితంపై విరక్తిచెందిన రమేష్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

పశువుల మృతి

ఉరవకొండ, ఏప్రిల్ 14: విడపనకల్లు మండలం కడదరబెంచి గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై నాలుగు పశువులు మృత్యువాత పడ్డాయి. నలుగురు పాడిరైతులు పశువులను మేత కోసం పొలాల్లోకి వదిలారు. తెగిపోయిన విద్యుత్ వైర్లు తగలడంతో పశువులు మృతి చెందినట్లు రైతులు తెలిపారు. రూ.2లక్షల దాకా నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. రైతులను ఆదుకోవాలని సర్పంచు దేవరాజు డిమాండ్ చేశారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 14: పట్టణంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న హనిమిరెడ్డిపై ఆదివారం కేసు నమోదుచేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గత నెల 27న చుక్కలూరురోడ్డులోని గంగమ్మ ఆలయం సమీపంలో గోవర్దన్‌రెడ్డి, అంజనేయులు రోడ్డుదాటుతుండగా అటుగా కారులో వేగంగా వస్తున్న హనిమిరెడ్డి ఇరువురిని ఢీకొనడంతో వారు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు హనిమిరెడ్డిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల కవాతు

పుట్లూరు, ఏప్రిల్ 14: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన ఎల్లుట్ల, మడుగుపల్లి, గరుగుచింతలపల్లి, కోమటికుంట్ల గ్రామాల్లో ఆదివారం బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించినట్లు పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరుపుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. చిన్నపాటి సమస్యలకు ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఇరువర్గాలతో మాట్లాడారు. ఆయన వెంట ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది ఉన్నారు.

17 నుంచి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 14: మండలంలో ఆలూరు గ్రామ సమీపంలో వెలసిన ప్రసిద్ధ వైష్ణవక్షేత్రం ఆలూరు రంగనాథస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు 17 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 17న అంకురార్పణ, 18న సింహవాహనం, 19న శేషవాహనం, 20న హనుమద్‌వాహనం, 21న గరుడ వాహనం, 22న గజవాహనం, 23న ఆలూరు గ్రామంలో శ్రీదేవిభూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం, 24న అశ్వవాహనం, 25న పుష్పయాగం, హంసవాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు.

ఘనంగా సిడిమాను మహోత్సవం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 14: పట్టణ సమీపం సిద్ధుల కొండలో వెలసిన రససిద్ధేశ్వరస్వామి రథోత్సవంలో భాగంగా ఆదివారం సిడిమాను మహోత్సవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి వస్త్రాలంకరణ, పూలలంకరణ తదితర ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దేవాలయం ఆవరణంలో సిడిమానుకు పూజారిని కట్టి మూడుసార్లు గోవింద నామస్మరణతో తిప్పారు. సిడిమాను మహోత్సవాన్ని తిలకించేందుకు రాయదుర్గం మండలం, పట్టణ, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రత్యేక హోదా సాధ్యం

ఉరవకొండ, ఏప్రిల్ 14: కాంగ్రెస్ ఎరీత్ర అధికారంలోకి వస్తేనే ప్రత్యేక హోదా సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి మధుసూదన్ పేర్కొన్నారు. పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ, లక్ష్మీనరసింహకాలనీలో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ రైతుల ఉత్పత్తుల ధరల స్థిరీకరణ నిధి ఏమైందని ప్రశ్నించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లభించక మిర్చిని పొలాల్లోనే రాశులు పోసుకుని అమ్ముకునేందుకు ఎదురుచూస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దగా పడ్డారన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ రాజశేఖర్ రెడ్డి

పామిడి, ఏప్రిల్ 14: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను సీఐ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... ఆసుపత్రిలో మినరల్ వాటర్‌తో చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. సీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తీక్ రెడ్డి, ఆయూష్ జిల్లా సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గుణశేఖర్‌రెడ్డి, రజియాబేగం, మురళి, జయరాం, షేక్షా పాల్గొన్నారు.

సైకిల్ గుర్తుకు ఓటువేయండి..



కరపత్రాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

పెద్దవడుగూరు, ఏప్రిల్ 14: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని టీడీపీ మండల నాయకులు కేశవరెడ్డి, కొండూరు కేశవరెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని భీమునిపల్లి, రావులుడికి, దిమ్మగుడి గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు. రమేష్‌యాదవ్, ప్రసాద్‌యాదవ్, రామిరెడ్డి, నాగరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

యాడికి: సూపర్‌సిక్స్ పథకాలతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ అన్నారు. ఆదివారం యాడికిలో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, నాయకులు నారాయణస్వామి, సుబహాన్, గోపి, రహంతుల్లా, చాంద్‌బాషా, యువరాజు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు. రాయలచెరువులో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. శోభన్‌బాబు, రామానాయుడు, శేఖర్, నాగరాజుగౌడ్, వెంకటరాముడు, రాఘవ, నెట్టికంటయ్య పాల్గొన్నారు.

జగన్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలి



ప్రచారం నిర్వహిస్తున్న విజయ్‌సింహా

ఉరవకొండ, ఏప్రిల్ 14: రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసిన జగన్ ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే తనయుడు విజయ్ సింహా అన్నారు. మండల పరిధిలోని రేణుమాకులపల్లి గ్రా మంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓ టు వేయాలని ప్రజలను కోరారు. సూపర్‌సిక్సు పథకాల కరపత్రాలను అందించారు. టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, రణధీర్, సుధాకర్, గుత్తా నా గేంద్ర, నరసింహులు, వన్నూరుస్వామి, ఎర్రిస్వామి, ఓబులప్ప, ఓబయ్య పాల్గొన్నారు.

బస్సుయాత్రకు తరలిన టీడీపీ నాయకులు



బస్సుయాత్రకు వెళుతున్న టీడీపీ శ్రేణులు

పుట్లూరు, ఏప్రిల్ 14: గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నిర్వహించిన స్వర్ణాంధ్ర సాధికార బస్సు యాత్రకు టీడీపీ మండల నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో సుదర్శన్‌నాయుడు, బాలరంగయ్య, చవ్వా కులశేఖర్‌రెడ్డి, రవిచంద్రనాయుడు, భాస్కర్‌నాయుడు, నాగేశ్వరరెడ్డి, గోవర్ధన్‌రాజు, శివశంకర్ రెడ్డి, రామానాయుడు, శ్రీనివాసులునాయుడు, రంగయ్య, రామాంజనేయులు, గుత్తా భాస్కర్‌నాయుడు ఉన్నారు.

వైసీపీ మండల మాజీ కన్వీనర్ టీడీపీలో చేరిక

రాయదుర్గం, ఏప్రిల్ 14: డీ.హీరేహాళ్ వైసీపీ మాజీ మండల కన్వీనర్‌గా ఉన్న ఎస్సీ నాగరాజు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో ఆయనకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కొద్దిరోజుల నుంచి వైసీపీకి దూరంగా ఉంటూ వస్తున్న నాగరాజు టీడీపీలో చేరడంతో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

అగ్ని ప్రమాదాలను నివారిద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక అధికారి అశ్వత్థ, సీఐ రామసుబ్బయ్య

గుంతకల్లుటౌన్, ఏప్రిల్14: అగ్ని ప్రమాదాలను నివారిద్దామని, దేశ సంపదను కాపాడుకుందామని అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి ఎన్ అశ్వర్థ పేర్కొన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అప్రమత్తంగా ఉంటే అగ్నిప్రమాదాలను నివారించవచ్చన్నారు. అగ్నిప్రమాదం లేని పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ హాజరయ్యారు. మొదట విధినిర్వహణలో ప్రాణాలు విడిచిన వారికి నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబడ్కేర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబు, రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు, ఉరవకొండలో పయ్యావుల కేశవ్, తాడిపత్రిలో జేసీ అశ్మిత్ రెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



కళ్యాణదుర్గం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అమిలినేని



రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు...



తాడిపత్రిలో అంబేద్కర్‌కు పూలమాల వేస్తున్న అశ్మిత్ రెడ్డి



తాడిపత్రిలో...



పామిడిలో...



రాయదుర్గంలో...



ఉరవకొండలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



గుంతకల్లులో మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం



గుత్తిలో...



పుట్లూరులో...